సాక్షి
మెదక్
గురువారం । 15 । ఆగస్టు । 2024

మది నిండా దేశభక్తి..

దేశభక్తిలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకతను చాటుకుంటోంది. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలు స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తిని నేటికీ చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నాయి.

పంద్రాగస్టు వేడుకల వేళ ప్రత్యేక కథనాలు IIలో..



న్యూస్‌రీల్

రాఖీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు

సంగారెడ్డిటౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని రీజినల్ మేనేజర్ ప్రభులత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు ఆరురోజుల పాటు అదనంగా 265 బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్టాండ్లలో రద్దీని పర్యవేక్షిస్తూ ఆయా రూట్లలో బస్సులు నడుపుతామని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెండు రైస్ మిల్లులకు నోటీసులు

చిన్నశంకరంపేట(మెదక్): సీఎంఆర్ ఎగవేసే రైస్‌మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం నార్సింగి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 19 రైస్ మిల్లులు సీఎంఆర్ ఇవ్వడంలో వెనకబడగా చర్యలకు ఉపక్రమించినట్లు తెలిపారు. ఇప్పటికే నర్సాపూర్‌కు చెందిన రైస్‌మిల్ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు ఆస్తులను సైతం వేలం వేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సాక్షిలో ఇటీవల ప్రచురితమైన 'మిల్లర్ల మాయాజాలం' కథనం గుర్తు చేస్తూ నార్సింగిలోను రెండు రైస్‌మిల్లులలో ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించి నోటీసులు అందించినట్లు చెప్పారు. త్వరలోనే చర్యలు చేపట్టి సీఎంఆర్ రికవరీకి చర్యలు చేపడుతామన్నారు. అవసరమైతే కఠిన చర్యలకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు.

కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం



ఒప్పందపత్రాలు ఇచ్చిపుచ్చుకుంటున్న ప్రతినిధులు

నర్సాపూర్: విద్యా, పరిశోధన రంగంలో కొత్త ఆవిష్కరణలకు కీలక పరిణామమని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబె, ఐకేపీ ప్రైమ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ సునీత అన్నారు. రెండు సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు కుదరడంతో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశోధన రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, యువతను ఆయా రంగాల్లో నైపుణ్యాలతో తీర్చిదిద్దే అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ ఒప్పందం రెండు సంస్థల పరస్పర అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

ప్రేమించిన యువతి దక్కలేదని..

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య



అంజనేయులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రేమించిన యువతి దక్కలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కంచన్‌పల్లిలో జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చౌదరిపేట ఆంజనేయులు (22) ఇంటర్ వరకు చదివి పూణేలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సుమారు మూడునెలల క్రితం అక్కడ చేగుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రెండువారాల క్రితం పెళ్లి చేసుకొని కంచన్‌పల్లికి వచ్చారు. కాగా విషయం తెలుసుకున్న యువతి, యువకుడి కుటుంబ సభ్యులు పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి ఎవరి ఇంటికి వారిని తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఆంజనేయులు మనస్తాపంతో ఉంటున్నాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని తల్లికి చెప్పి వెళ్లాడు. ఎంతకీ రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి తండ్రి పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కూతురు హత్యకేసులో తండ్రి రిమాండ్

వెల్దుర్తి(తూప్రాన్): కూతురు మృతి కేసులో తండ్రిని అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ రాజు పేర్కొన్నారు. వెల్దుర్తి పంచాయతీ పరిధి శేరీల గ్రామానికి చెందిన ఇక్కిరి శ్రీశైలం,సౌందర్య దంపతుల కూతురు నిఖిత (9)కు ఈ ఏడాది మే నెలాఖరులో కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలిపి సొంత తండ్రే బలవంతంగా తాగించాడు. మృత్యువుతో పోరాడి చిన్నారి మృతిచెందింది. తన కూతురు మృతికి భర్త కారణమంటూ అప్పట్లో సౌందర్య ఫిర్యాదు చేసింది.



కలెక్టరేట్‌కు మువ్వన్నెల శోభ

స్వాతంత్య్ర దినోత్సవం వేళ కలెక్టరేట్‌ను బుధవారం రాత్రి త్రివర్ణ కాంతులీనేలా అలంకరించారు. మువ్వన్నెల కాంతుల సొబగులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

– మెదక్ కలెక్టరేట్

జాడలేని వాన

- వేసవిని తలపిస్తున్న ఎండ
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు



చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో నీరందక ఎండిపోతున్న నాట్లు

మెదక్‌జోన్: వారం రోజులుగా ఎండ దంచి కొడు తోంది. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదు కావడంతో ఉక్కపోత మొదలైంది. కార్తెలు కరిగిపోతున్నా.. ఇప్పటివరకు జిల్లాలో చిరుజల్లులు తప్ప చెరువు, కుంటల్లోకి నీరు చేరిన దాఖలాలు లేవు. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికే సాగు చేసిన పంటలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

బోరుబావులే ఆధారం..

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది అన్నిరకాల పంటలు 3.73 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. అందులో వరి 3.27 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు అన్నిరకాల పంటలు 2.90 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. అందులో వరి ఇప్పటివరకు 2.26 లక్షల ఎకరాల్లో సాగైనట్లు రికార్డులు చెబుతున్నాయి. కాగా 95 శాతం బోరుబావుల ఆధారంగా సాగు చేసినవి కావడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. పంటలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. రైతులు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు. మబ్బులు కమ్ముకుంటున్నప్పటికీ వర్షాలు కురవడం లేదు. అంతే కాకుండా మోటార్లకు సరిపడా నీరందక కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హల్దీలో చుక్క నీరు లేదు

జిల్లాలో హల్దీప్రాజెక్టు సుమారు 75 కిలో మీటర్లకు పైగా విస్తరించి ఉంది. తూప్రాన్, వెల్దుర్తి, కొల్చారం, చిన్నశంకరంపేట, మెదక్, హవేళీఘనపూర్ మండలాల పరిధిలో సుమారు 60 వేల ఎకరాలకు సాగు నీరందిస్తోంది. కానీ ప్రస్తుతం ఇందులో చుక్క నీరు లేదు. గతంలో ఏటా గోదావరి జలాలను హల్దీలోకి వదిలేవారు. ఈసారి దాన్ని పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారని ఆయా మండలాల రైతులు వాపోతున్నారు. ఒక్కసారి హల్దీలోకి నీరు చేరితే ఎటూ 2 కిలో మీటర్ల దూరంలోని భూగర్భజలాలు పెరిగి వేలాది బోరు బావుల్లోకి నీటిమట్టం పెరిగే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా అధికారులు, నాయకులు ఆలోచన చేయడం లేదని కర్షకులు వాపోతున్నారు. అలాగే తీవ్ర వర్షాభావ పరిస్థితులతో చెరువు, కుంటల్లోకి సైతం నీరు చేరలేదు. జిల్లాలో అతిపెద్ద చెరువు కోంటూర్ చెరువు ఆయకట్టు 1,450 ఎకరాలు కాగా కనీసం 500 ఎకరాలల్లో నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. రాయినిపల్లి ప్రాజెక్టు వెనకాల 1,260 ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులోకి నీరు రాలేదు. అడపాదడపా కురిసిన వర్షాలకు నాట్లు వేసినప్పటికీ వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి.

ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం
10	34.5	22.5
11	35.5	22.9
12	34.2	23.0
13	35.6	22.9
14	36.8	23.6

పోలీసుల విస్తృత తనిఖీలు



థియేటర్‌లో బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు

మెదక్ మున్సిపాలిటీ: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుధవారం బాంబ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు నిర్వహించిందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో జనసాంద్రత అధికంగా ఉండే బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, గవర్నమెంట్ ఆఫీసులు, సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహించినట్లు వివరించారు. ఈసందర్భంగా ప్రజలందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ షాహెద్ అలీ, కానిస్టేబుళ్లు నర్సింలు, సిద్దిరాములు, దుర్గాప్రసాద్, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మూడున్నర తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు చోరీ

తూప్రాన్: పట్టపగలు పట్టణ కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం. పట్టణంలోని 12 వార్డు నర్మదా సీడ్ ఎదురుకాలనీలో నివాసం ఉంటున్న టాటా కాఫీ కార్మికుడు తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం మేడ్చల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువాను పగులగొట్టి అందులో ఉన్న మూడున్నర తులాల బంగారు నగలు, 10 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

త్వరలో ట్రిపుల్‌ఆర్ పనులు షురూ..



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

- భూసేకరణకు రైతులు సహకరించాలి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్: ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగు రోడ్డు) ఉత్తర భాగం పనులకు వచ్చే అక్టోబర్ నెలలో దసరా పండుగ సందర్భంగా శంకుస్థాపన చేయడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రకటించారు. బుధవారం గజ్వేల్‌లో అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ భూసేకరణపై రైతుల్లో ఎన్నో అపోహలు ఉన్నాయని, బడాబాబులు అలైన్‌మెంట్‌ను పేద రైతుల పొలాల్లోకి మార్చారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ఓ ప్రైవేటు ఏజెన్సీ ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం రోడ్డు నిర్మాణంపై మూడు అలైన్‌మెంట్లు ఇవ్వగా...అందులో ప్రజలకు ఎక్కువగా నష్టం జరగకుండా ఉండే 158.645కిలోమీటర్ల అలైన్‌మెంట్‌ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పనులకు సంబంధించి 2021 డిసెంబర్ 20న కేంద్రం నుంచి ఆమోదం లభించిందని, ఆ తర్వాత రూ.15,239కోట్ల నిధులను సైతం కేటాయించారన్నారు. కానీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణను వేగవంతం చేయలేకపోయిందని చెప్పారు. ప్రస్తుతం 4,750 ఎకరాల వ్యవసాయ భూమి, మరో 180 ఎకరాల అటవీశాఖ భూమి సేకరించాల్సి ఉందన్నారు. భూసేకరణ పూర్తి చేసుకొని దసరా వరకు పనులకు శంకుస్థాపన చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్తిగా గ్రీన్ ఫీల్డ్ నిర్మాణం జరుగుతున్న ఈ రోడ్డు వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు యాదాద్రి జిల్లాలో వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి బాటలు పడతాయని అన్నారు. ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి సంబంధించి సమస్యలను తన దృష్టికి తెస్తే...పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు నిండు ప్రాణం బలి

- టిప్పర్ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

మెదక్ మున్సిపాలిటీ: టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ నిండు ప్రాణం బలైంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పిట్లంబేస్ వీధికి చెందిన నాగమల్లి శ్రీనివాస్(65) పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బోరంచమ్మ ఆలయంలో సేవకుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఆలయంలో సేవా కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాందాస్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా ఓ టిప్పర్ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ.. శ్రీనివాస్‌ను ఢీకొట్టడ్డాడు. కింద పడిన అతడిపై నుంచి టిప్పర్ వెళ్లింది. దీంతో శ్రీనివాస్ మృతదేహం నుజ్జునుజ్జు అయింది. దీంతో రాందాస్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

సమన్వయంతో పని చేయాలి

- 24 గంటలు వైద్యసేవలు అందించండి
- కలెక్టర్ రాహుల్‌రాజ్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: సమన్వయంతో పనిచేస్తూ రోగులకు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న రోగుల సమాచారం ఆస్పత్రుల్లో ఉండాలన్నారు. అంటూ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్య పరీక్షల ఫలితాలు త్వరగా అందించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అంతకుముందు కలెక్టర్ రోగులతో నేరుగా మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శ్రీరామ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శివదయాళ్, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డితో కలసి పరిశీలించారు. పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ వివిధశాఖల అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



కౌడిపల్లి: డాక్టర్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

చిన్నశంకరంపేట(మెదక్)/కౌడిపల్లి(నర్సాపూర్): సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. తరచూ ఓపీ చూసే డాక్టర్ మారడంతో తమకు సరైన వైద్యం అందడంలేదని వారు చెప్పారు. ఈ విషయంపై మెడికల్ ఆఫీసర్‌ను ఆరా తీసిన అదనపు కలెక్టర్ వీలైనంత వరకు ఒక్కరే ఓపీ చూసేలా చూడండని చెప్పారు. అనంతరం కౌడిపల్లి పీహెచ్‌సీ, సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స కోసం వస్తే వైద్య సిబ్బంది సరిగా చూడడం లేదని పలువురు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాతావరణ మార్పులతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మండలంలోని దేవులపల్లిలో మురికి గుంత కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయని, పూడ్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్‌ఐ శ్రీహరి, సీహెచ్‌ఓ స్వర్ణలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక..

తల్లీ కూతురు ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): ఒంటరితనం భరించలేక తల్లి కూతురు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రెడ్డిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తలారి పోచమ్మ (75), ఎల్లవ్వ (48) తల్లి కూతురు. ఇద్దరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఎలవ్వ కుమారుడు చిన్న ముత్యంకు గతంలో మక్కరాజీపేటకు చెందిన లావణ్యతో వివాహం జరిగింది. ఆరునెలల క్రితం ఆమె అనుమానస్పద స్థితిలో బావిలో పడి మృతిచెందింది. అయితే భర్త, అత్త, ఆడబిడ్డ కలిసి హత్య చేశారని లావణ్య తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ముత్యంను అరెస్ట్ చేశారు. జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై వచ్చి హైదరాబాద్‌లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెడ్డిపల్లిలో ఎల్లవ్వతో పాటు తల్లి పోచమ్మ మాత్రమే ఉంటున్నారు. అయితే లావణ్య మృతిచెందిన నాటి నుంచి గ్రామస్తులతో పాటు ఇరుగుపొరుగు వారు వీరితో మాట్లాడడం మానేశారు. ఈక్రమంలో ఒంటరితనం భరించలేక మంగళవారం రాత్రి పోచమ్మ, ఎల్లవ్వ ఉరేసుకొని మృతిచెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ బాలరాజు పంచనామా నిర్వహించి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఎల్లవ్వ కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మీ కొడుకు క్రైంలో చిక్కుకున్నాడు..

- వీసా రద్దు అయింది
- సైబర్ నేరగాళ్ల కొత్త పంథా
- తల్లిదండ్రులకు బెదిరింపు ఫోన్ కాల్స్



మెదక్ మున్సిపాలిటీ: విదేశాల్లో చదువు, ఉద్యోగం కోసం వెళ్లిన వారి తల్లిదండ్రుల వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారు. మీ పిల్లలు క్రైంలో ఇరుక్కున్నారని వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. వాట్సాప్ కాల్‌లో మాట్లాడించి 'సేవ్ మీ డాడీ' అని గొంతును వినిపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇలాంటి సంఘటనే జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఫత్తేనగర్‌కు చెందిన ఇప్ప సత్యనారాయణ కుమారుడు అఖిల్ ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి నీ కొడుకు స్నేహితులతో కలిసి క్రైంలో ఇరుక్కున్నాడని 923154904886 నంబర్‌తో వాట్సాప్ కాల్ చేశారు. వీసా రద్దు అయిందని తెలిపారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన సత్యనారాయణ ఇంట్లో వారిని ఆరా తీసి కొడుకుకు ఫోన్ చేశాడు. తాను ఎలాంటి ఇబ్బందుల్లో పడలేదు.. సంతోషంగా ఉన్నానని సమాచారం అందించాడు. దీంతో అతడు వెంటనే మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరాలపై అవగాహన ఉండడంతో అప్రమత్తమై తప్పించుకున్నాడు. విదేశాలకు వెళ్లిన పిల్లల తల్లిదండ్రులకు ఇలాంటి ఫోన్ కాల్స్ సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. అయితే ఇటీవల జిల్లాలోని తూప్రాన్ మండల కేంద్రానికి చెందిన ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.15 లక్షలు పోగొట్టుకున్నాడు. స్థానికంగా ఉండే ఓ ఉద్యోగి సైతం ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ కోసం వెతికి సైబర్ నేరగాళ్లు వేసిన ఉచ్చులో చిక్కుకొని రూ.15 లక్షల మేర పోగొట్టుకున్నాడు.


లోన్ పేరిట నమ్మించి..

శివ్వంపేట(నర్సాపూర్): పది లక్షల లోన్ మంజూరైందని ఓ వ్యక్తిని నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ.1,46,595 కాజేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మండల పరిధి సికింద్లాపూర్‌కు చెందిన దాసుపల్లి సత్యనారాయణకు ఆరునెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీకు రూ. 10 లక్షల లోన్ మంజూరైందని నమ్మించాడు. ఇన్సూరెన్స్ ప్రాసెస్ కోసం డబ్బులు చెల్లించాలని చెప్పడంతో దశలవారీగా రూ.1,46,595 అపరిచిత వ్యక్తి చెప్పిన అకౌంట్‌లో వేశాడు. 40 రోజుల్లో లోన్ క్లియరెన్స్ అనంతరం డబ్బులు వస్తాయని చెప్పాడు. 40 రోజుల అనంతరం పలుమార్లు అపరిచిత వ్యక్తిని లోన్ డబ్బులు కోసం అడిగితే సరైన సమాధానం రాలేదు. మోసపోయానని గ్రహించి బుధవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సైబర్ క్రైం ఫిర్యాదులు

జిల్లాలో సైబర్ క్రైం ఫిర్యాదులు 2023లో 640 రాగా రూ. 2 కోట్ల 20 లక్షలు దోపిడీకి గురి కాగా రూ. 41 లక్షలను హోల్డ్‌లో పెట్టి రూ. 4 లక్షలు రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఈ ఏడాది జూలై వరకు 524 ఫిర్యాదులు రాగా రూ.5 కోట్ల 83 లక్షలు దోపిడీకి గురికాగా రూ. 32 లక్షలను హోల్డ్‌లో పెట్టి రూ.3 లక్షలు రికవరీ చేసినట్లు చెప్పారు.

లింకుల జోలికి వెళ్లొద్దు



సైబర్ నేరాలపై ప్రతి నెల రెండవ బుధవారం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. లోన్లు ఇస్తామని ఆశ చూపించే వారిని నమ్మొద్దు. డబ్బులు ఎవరికీ ఊరికే రావు, ఆశపడి మోసపోవద్దు. ప్రజలు తమ ఫోన్లకు వచ్చే అనవసర లింక్‌ల జోలికి అసలే వెళ్లొద్దు. మోసపూరిత ఆఫర్లను నమ్మొద్దు. రైతు రుణమాఫీ పేరిట కూడా మోసాలు జరుగుతున్నాయి. ప్రజల్లో సైబర్ నేరాలపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నంబర్ గాని లేదా సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

మదినిండా దేశభక్తి ఎల్లెడలా కీర్తి

వారందరిలో జాతీయ భావం ఉట్టిపడుతోంది.. దేశభక్తి తొణికిసలాడుతోంది. వెరసి ఉమ్మడి మెదక్ జిల్లా మురిసిపోతోంది. ఊరూరా ప్రత్యేకతను చాటుతోంది. ఊరు చిన్నది.. దేశభక్తిలో పెద్దది అన్న రీతిలో కీర్తిని సాధిస్తున్నాయి. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాలకు నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. శ్రమైక జీవనంతో ముందడుగు వేస్తున్నాయి. కొన్నేళ్లుగా కొన్ని గ్రామాల్లో మద్యం ముట్టడంలేదు.. మిరుదొడ్డి మండలంలో 43 ఏళ్లుగా జాతీయ జెండాను నిరంతరం ఎగురుతూ ఉండటం గ్రామస్తుల్లో ఉన్న దేశభక్తికి నిదర్శనం. ఇలా ప్రతి గ్రామం ప్రత్యేకతను చాటుతుండటం విశేషం.

అదృష్టంగా భావిస్తున్నా..



గాంధీరెడ్డి

నేను అక్టోబర్ 2 గాంధీ జయంతిన పుట్టాను. అమ్మానాన్న ఆ మహాత్ముడిపై ఇష్టం దీంతో నా పేరు గాంధీరెడ్డి అని పెట్టారు. మా ఊరు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామం దుబ్బాక మండలం పోతారం. ఇప్పుడు నా వయస్సు 51 ఏళ్లు. నేను ఎక్కడికి పోయిన అందరూ గాంధీరెడ్డి అంటూ ప్రత్యేకంగా పిలుస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. గాంధీరెడ్డి అనే పేరు మా చుట్టుపక్కల ఎవ్వరికీ లేదు. నాదే స్పెషల్ అంటూ అందరూ మాట్లాడుతుంటుంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఏటా అక్టోబర్ 2న బర్త్ డే జరుపుకుంటాను. ఆగస్టు 15న ఏటా స్వాతంత్ర్య దినోత్సవం రోజున జరిగే వేడుకల్లో ప్రత్యేకంగా పంచెకట్టుకొని పాల్గొనడం ఇష్టం.

– దుబ్బాక

నెహ్రూ అంటే.. ఆ ఫీలింగే వేరు



మా నాన్నకు జవహర్ లాల్ నెహ్రూ అంటే చాలా ఇష్టం. ఆ పేరును నాకూ పెట్టారు. నెహ్రూ అని పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉంది. మా ఫ్రెండ్స్ నెహ్రూ అని పిలుస్తుంటే ఆ ఫీలింగ్ వేరులా ఉంటుంది. రేగోడ్(మెదక్):

– నెహ్రూ, యువజన సంఘం నాయకుడు

బీదర్ చౌరస్తా.. అమర జవాన్‌ల చౌక్



జహీరాబాద్ టౌన్: దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమర జవానుల జ్ఞాపకార్థం పట్టణం సమీపంలో బీదర్ చౌరస్తాలో కొంత మంది యువకులు, మాజీ సైనికులు కలిసి స్మారక స్థూపం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి విస్తర్ణంలో భాగంగా చౌరస్తాలో కొంత స్థలం ఉండగా అక్కడ నాలుగేళ్ల క్రితం స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేసి అమరులకు నివాళులర్పిస్తున్నారు. అప్పటి నుంచి బీదర్ చౌరస్తా అమర జవాన్‌ల చౌక్‌గా మారింది. స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతో పాటు కార్గిల్ విజయ్ దివస్ తదితర సందర్భాల్లో మాజీ సైనికులు, యువకులు అరులకు నివాళులు అర్పిస్తున్నారు. స్మారక స్థూపం వద్ద మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం వారు అభివృద్ధి పనులు చేపట్టారు. స్థూపం చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి పూల మొక్కలను నాటారు.



తున్కిఖాల్సా పల్లె ప్రకృతివనంలో 48 అడుగుల త్రివర్ణ పతాకం

48 అడుగుల జెండా

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం తున్కిఖాల్సా పల్లె ప్రకృతివనంలో 48 అడుగుల ఎత్తున జాతీయ జెండా ఏడాది పొడుగునా రెపరెపలాడుతూ అందరినీ ఆకట్టుకుంటుంది. 12 అడుగుల ఎత్తు, 18 అడుగుల పొడవు కలిగి ఉంది. మాజీ సర్పంచ్ కటికె సంధ్యజానీ దంపతులు గ్రామానికి రూ.80 వేల సొంత ఖర్చులతో 2021 జనవరిలో ఏర్పాటు చేయించారు. 2021 జనవరి 26 రిపబ్లిక్ డే రోజున పతాకం ఆవిష్కరించారు. దీంతో యేటా స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రకృతివనంలో ఈ భారీ పతాకావిష్కరణ ఆనవాయితీగా కొనసాగుతోంది.

మద్యం ముట్టని గ్రామాలు

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండలం జంమ్గిలో 18 ఏళ్లు మద్యం నిషేధం అమలవుతోంది. 2006లో గ్రామపెద్దలతో చర్చించి మద్యం విక్రయిస్తే రూ.5 వేలు జరిమానా విధించాలని తీర్మానించారు. మద్యం విక్రయిస్తే రూ.5 వేలు జరిమానా విధిస్తున్నారు. నాటి నుంచి ఇప్పటివరకు గ్రామంలో మద్యపాన నిషేధం అమలు అవుతోంది. అసలు.. 2006లో పలువురు యువకులు మద్యం మత్తులో గ్రామ కూడలి వద్ద ఘర్షణ పడ్డారు. గ్రామస్తులు వారించి గొడవలకు కారణమవుతున్న మద్యం విక్రయాలను నిలిపివేసేందుకు గ్రామ పెద్దలు ముందుకొచ్చారు.



జంమ్గి గ్రామ పంచాయతీ భవనం

అంబాజిపేట- పదేళ్లుగా..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేటలో పదేళ్లుగా మద్య నిషేధం అమలవుతోంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించి గ్రామ పెద్దలను ఒప్పించి అమలులోకి తీసుకువచ్చారు. పదేళ్లకు ముందు గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహణకు వేలం ద్వారా పాట పాడి వైన్ షాపులు నడపడగా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరిగాయి. మరోసారి షాప్ వేలం వేసేందుకు గ్రామపంచాయతీ వద్ద గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. విషయం తెలుసుకున్న మహిళ సంఘాల సభ్యులు ర్యాలీగా వెళ్లి వేలాన్ని అడ్డుకున్నారు. అప్పటి నుంచి మద్యం నిషేధాన్ని తీర్మానించారు.

వరిగుంతం కూడా పదేళ్లుగా..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరిగుంతం గ్రామం పదేళ్లుగా మద్య నిషేధానికి కట్టుబడింది. 2014 ముందు గ్రామంలో చిన్న కొట్టులో సైతం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరిపారు. మద్యానికి ఆడ,మగ తేడా లేకుండా బానిసలై గ్రామంలో అశాంతి, అసాంఘిక కార్యక్రమాలు కొనసాగాయి. యువత మందుకు బానిసై రోజూ గొడవలు పడటం పరిపాటిగా మారింది. అయితే మత్తులో పాతికేళ్ల నిండని యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆ సమయంలో షాపులను నియంత్రించేందుకు కొందరు యువకులు, మహిళా సంఘాల వారు ఒక్క తాటిపైకి వచ్చి మద్య నిషేధంపై పోరాడారు. 2014లో గ్రామంలో పూర్తి మద్య నిషేధం ప్రతిజ్ఞ, తీర్మానించారు. గ్రామ బహిష్కరణ కూడా తీర్మానించారు.

అల్లీపూర్.. మువ్వన్నెల జోర్

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాటంలో చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు ప్రత్యేకత ఉంది. గ్రామానికి చెందిన కిషన్ రావు నేతృత్వంలో ఉద్యమకారులు, గ్రామస్తులు కలిసి 1947 సెప్టెంబర్ 11న అల్లీపూర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. నిజాం పాలనలో తెలంగాణలో తొలిసారిగా జాతీయ పతాకం ఇక్కడే ఎగిరిందంటారు ఉద్యమకారులు. నాటి ఈ ఘటనకు ప్రతీకారంగా నిజాం సైన్యం దాడిలో ఉద్యమకారుడు లక్ష్మయ్య మృతిచెందాడు. అనంతరం గ్రామ ప్రజలు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. విషయం తెలియగానే నిజాం సైన్యం గ్రామానికి చేరుకుని 100 మందిని అరెస్టు చేసి ఔరంగాబాద్ జైలుకు తరలించారు. నాటి ఘటనకు గుర్తుగా బురుజు నిర్మించారు.



అల్లీపూర్‌లో బురుజు

లక్ష్మీనగరం.. బాపూజీ కలలు సాకారం



పాపన్నపేట(మెదక్): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా నిలుస్తుంది లక్ష్మీనగరం. పారిశుద్ధ్యం పచ్చదనం ప్రాధాన్యాంశాలుగా దోమలు లేని పల్లెగా.. రోగం లేని ముల్లెగా ప్రశంస అందుకుంటున్న ఈ గ్రామం. 2020 ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైంది. వాటర్ మేనేజ్‌మెంట్ కింద నాటి కలెక్టర్ ధర్మారెడ్డి చేతుల మీదుగా అప్పటి సర్పంచ్ అనురాధ అవార్డు అందుకున్నారు. 921 జనాభా గల గ్రామంలో 473 మంది మహిళలున్నారు. ఇంటింటా కళకళలాడే పూల మొక్కలు కనువిందు చేస్తుంటాయి. ప్రతి జూన్ 2న మొక్కలకు పుట్టిన రోజు వేడుకలు జరపడం ఈ ఊరి ప్రత్యేకత. గ్రామంలో 100 శాతం మరుగుదొడ్ల వినియోగం.. ఇంకుడు గుంతలు.. ఇంటింటికి డ్రైనేజీ.. వీధి వీధికి విద్యుత్ దీపాలతో ఈ పల్లె కళ కళలాడుతోంది. సేంద్రీయ వ్యవసాయం, సంప్రదాయక పంటలు పండిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి మహిళలు అన్ని రకాల వ్యాపారాలు చేస్తూ కుటుంబ పోషణలో అండగా నిలుస్తున్నారు. కోలాటం, భజన లాంటి ఆధ్యాత్మిక చింతనతో శ్రమైక జీవన సౌందర్యపు రుచులు చవిచూస్తున్నారు.

ఎర్రవల్లి.. ఆదర్శవల్లి



ఎర్రవల్లి గ్రామ వ్యూ

మర్కూక్(గజ్వేల్): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఎర్రవల్లిలో కనిపిస్తుంది. అన్ని రంగాల్లో ఆదర్శవల్లిగా గ్రామం నిలిచింది. మిగతా గ్రామాలకు భిన్నంగా.. రాష్ట్రానికే దిక్సూచిగా అభివృద్ధిలో ప్రత్యేకత సంతరించుకుంది. అభివృద్ధి పనులు, స్వచ్ఛ భారత్, సీసీ రోడ్లు, సోలార్ సిస్టమ్, డబుల్ బెడ్‌రూం ఇల్లు తదితర అభివృద్ధి పనుల్లో ముందంజలో ఉంది. మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామంలో సకల సదుపాయాలు కల్పించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపారు. గ్రామంలో 570 డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇంటింటికి సోలార్ సిస్టమ్ అమర్చారు. 2019–20కి గాను ప్రధాని మోదీ నుంచి స్వచ్ఛ సుందర్ సౌచాల్య అవార్డు దక్కించుకుంది. 2019–20 గాను స్వచ్ఛ సుందర్ సౌచాల్య ఇండివిజల్ కేటగిరిలో నేషనల్ అవార్డు, 2020–21 గాను ఎర్రవల్లిలో 519 కుటుంబాలు సోలార్ వినియోగానికి గాను రాష్ట్ర ఐటీ మంత్రి చేతుల మీదుగా గ్రామ ఉర్జా స్వరాజ్ విశేష్ పంచాయతీ పురస్కారం అవార్డు, అభివృద్ధి, స్వచ్ఛతలో మొట్టమొదటగా నిలిచి 2022 ఏప్రిల్ 9న దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ స్వశక్తి కిరణ్ జాతీయ పురస్కారం అవార్డు సైతం దక్కింది.

బురుజుపై 15 ఏళ్లుగా సంబరాలు

తొగుట(దుబ్బాక): నాడు గ్రామ రక్షణ కోసం నిర్మించిన బురుజుపై జాతీయ జెండా ఎగరవేస్తూ గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. మండలంలోని ఘనపురంలో ఒకప్పుడు గ్రామానికి రక్షణ కవచంగా బురుజు ఉంది. గ్రామం విస్తరించడంతో గ్రామ నడిబొడ్డులోకి చేరింది. పురాతన కట్టడాన్ని భావితరాలకు అందించాలన్న లక్ష్యంతో శిథిలమవుతున్న అపురూప కట్టడాన్ని గ్రామస్తులు మరమ్మతులు చేయించారు. యేటా జనవరి 26, ఆగస్టు 15న జెండా ఎగరవేస్తూ సంబరాలు నిర్వహిస్తున్నారు.



బురుజుపై జాతీయ జెండా ఎగురవేసిన దృశ్యం

43 ఏళ్లుగా త్రివర్ణం..



రుద్రారంలో త్రివర్ణ పతాకం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో 43 ఏళ్లుగా నిరంతరం త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. గ్రామంలో ప్రతీఒక్కరిలో దేశభక్తిని చాటాలన్న ఉద్దేశంతో గ్రామంలో జాతీయ జెండాను అవనతం చేయకుండా నిరంతరం ఎగరాలని 43 సంవత్సరాల క్రితం గ్రామస్తులు తీర్మానించారు. నాటి నుంచి నేటి వరకు జాతీయ పతాకాన్ని గౌరవిస్తూ తమ దేశ భక్తిని చాటుకుంటున్నారు. గ్రామ ప్రధాన కూడలిలో 24 అడుగుల నిటారు రాయిపై ప్రత్యేక కర్రను ఏర్పాటు చేసి జాతీయ జెండాను ఎగుర వేస్తున్నారు. ఆగస్టు 15, జనవరి 26న గ్రామంలో జాతీయ జెండాను ప్రభుత్వ అధికారులు ఎగుర వేస్తున్నారు.

ఆర్మీలో మాచవరం యువత

మెదక్‌జోన్: జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో మాచవరం గ్రామం ఉంది. అక్షరాస్యతతో పాటు చైతన్యం నింపుకున్న ఊరులో ఉంటున్న యువతకు దేశ భక్తి కాస్త ఎక్కువే. ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కొందరైతే.. దేశ సేవలో భాగస్వామ్యం కావాలనే తపన మరికొందరిది. అందులో భాగంగానే ఆర్మీలో చేరేందుకు యువకులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి 11 మంది ఆర్మీలో చేరగా ఇందులో 9 మంది రిటైర్ అయ్యారు. ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. విశ్రాంత సైనికులు.. యువకులు ఆర్మీ వైపు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారు.

అమ్మాయి పుడితే.. ఆనందమే వేరు



ఆడపిల్లలు పుట్టిన తల్లులకు రూ.5 వేలు అందజేసిన నీలం మధు(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: అమ్మాయి పుడితే భారంగా భావిస్తున్న రోజులవి...ఇలాంటి సమాజంలో ఆడపిల్ల పుట్టడం వరమంటున్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌కు చెందిన కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్. చిట్కుల్‌లో ఆడపిల్ల పుడితే రూ.5 వేలు ఇస్తానని గతేడాది మార్చిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినూత కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజే 14 మంది ఆడపిల్లలు పుట్టిన తల్లులకు రూ.5 వేలు చొప్పున అందజేశారు.

గాంధీ స్ఫూర్తితో ఆపన్న హస్తం

కంగ్టి(నారాయణఖేడ్): చేతనైనంత సాయం చేసి పేదలకు ఆపన్న హస్తం అందించే నైజం ఆమెది. మాజీ సర్పంచ్ రాథోడ్ సురేఖ వెంకట్‌కు గిరిజన తండాలో మంచి పేరు ఉంది. 2019లో సర్పంచ్‌గా గెలిచిన తర్వాత ఏటా గిరిజనులకే కాకుండా ఆటల్లో, చదువుల్లో మంచి ప్రతిభ చూపుతున్న పిల్లలకు నగదు నజరానాలు ప్రకటించారు. ఆడపిల్లలు పుడితే ఆరోగ్య కిట్ అందజేస్తున్నారు. అనేక కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు.



గిరిజన ఆడపిల్ల వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ సురేఖ

సైనిక కుటుంబసభ్యులకు సన్మానం

నంగునూరు(సిద్దిపేట): సైన్యంలో సైనికులు పనిచేస్తుండగా.. వారి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ సైనికుడు, బీజేపీ ఆర్మీ సెల్ కన్వీనర్ నీల చంద్రం ఆధ్వర్యంలో సన్మానించారు. మగ్దుంపూర్‌కు చెందిన జాప స్వామి, బత్తుల శ్రీకాంత్, శ్రీనివాస్, ఉగ్గి తిరుపతి సైన్యంలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని వారి తల్లిదండ్రులు జాప అయిలయ్య, బుచ్చమ్మ, బత్తుల యాదయ్య, ఊర్మిళ, ఉగ్గి తారమ్మలను సన్మానించారు.



సైనికుల కుటుంబాలకు సన్మానం

కార్గిల్ వీరుడికి నివాళి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో రైతు కుటుంబం యాదిరెడ్డి-రంగమ్మల కుమారుడు పిన్నింటి చంద్రారెడ్డి దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరారు. పూంచ్ సెక్టర్‌లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఇండియా-పాకిస్తాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధంలో సెప్టెంబర్ 19, 2002లో వీరమరణం పొందారు. దీంతో గ్రామ కూడలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి యేటా సెపెంబర్ 18న విగ్రహం వద్ద నివాళులర్పిస్తారు.



చంద్రారెడ్డి

వీరుడికి విగ్రహం



జవాన్ నరసింహనాయక్ విగ్రహం వద్ద తల్లిదండ్రులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం దుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని రాజుతండాకు చెందిన గుగులోతు నరసింహనాయక్ సైనంలో పని చేస్తూ 2014లో సుక్మా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం చెందారు. తండ్రి గుగులోతు లింగయ్య-సత్తమ్మ తమ పొలంలో కొడుకు విగ్రహాన్ని కట్టించారు. రాజుతండా మీదుగా పంజాగుట్టుతండా వరకు సుమారుగా 2 కిలో మీటర్ల దూరం వరకు జవాన్ పేరిట రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. నరసింహనాయక్‌కు ముగ్గురు సోదరీమణులున్నారు. ఏటా రాఖీ పండుగ రోజు విగ్రహానికి రాఖీ కడుతారు. అలాగే ఆగస్టు 15, జనవరి 26న విగ్రహం ఎదుట జాతీయ జెండాను తల్లిదండ్రులు ఎగరవేస్తున్నారు.

ఏడాది పొడవునా మువ్వన్నెల రెపరెపలు

చిన్నశంకరంపేట(మెదక్): స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగురవేసి సాయంత్రం దించుతారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు నార్సింగి మండలం శేరిపల్లిలో మాత్రం రెండు చోట్ల ఎగురవేసిన జాతీయ జెండాను ఏడాది పొడువునా ఉంచుతారు. గ్రామంలోని బురుజుపై, గ్రామ చావిడి(కచీర్) వద్ద జాతీయ జెండా ఎగురవేసి ఏడాది పొడువునా అలాగే ఉంచడం ఆనవాయితీగా వస్తుంది. రాజుల కాలం నాటి బురుజుపై నేటికి జెండా రెపరెపలాడుతోంది.



శేరిపల్లిలో బురుజుపై జాతీయ జెండా

రూ.25లకే జాతీయ జెండా

హుస్నాబాద్: స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ హర్ ఘర్ తిరంగా పిలుపులో భాగంగా బుధవారం హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో పోస్టల్ అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పంపిన ఉత్తరాన్ని మంత్రి ప్రభాకర్‌కు కరీంనగర్ సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ చంద్ర మోహన్ అందజేశారు. ప్రతి పోస్టాఫీస్‌లో రూ.25లకే జాతీయ జెండాను ప్రజలకు అందుబాటులో ఉంచారు.



జాతీయ జెండాతో మంత్రి ప్రభాకర్